# నవ్వినా - ఏడ్చినా

కోటేశు తాగుతున్నాడు — పిచ్చిగా తాగుతున్నాడు—పిచ్చివాడిలా తాగుతున్నాడు— దేవలా తాగుతున్నాడు.

అతని చేతిలో కల్లుముంత వణుకుతోంది. నోట్లో పోసుకుంటున్న కల్లు సగం గడ్డంమీది నించి గుండెలమీదకు కారుతోంది.

కోటేశు కళ్ళు ఎర్రటి కొరువుల్లావున్నాయి. అవి మండుతున్నాయి. మనిషి గుర్రమెక్కిన వాడిలా వూగిపోతున్నాడు.

ముంతను ఖాళీచేసి కల్లు కొట్టు సుక్కమ్మ ముందు పెట్టాడు.

"ఇంక తాగితే సత్తావురా అన్నాయంగా. ఇప్పటికి అగ్గైపోవాదిరా కోటేశూ. . నామాట యినుకో. ఎందుకు పానాలు తీసుకుంటావ్?" అన్నది సుక్కమ్మ.

"వాడెల్లగుతుంటే నీకేటే సుక్కమ్మా.... సత్తే సచ్చాడు. ఆడడిగిన తి పోసెయ్,"ఎవడో వాడు అప్పటికే గుర్రమెక్కాడు.

"నీకేత్రా యెదవా. నువిట్టాగే సెబుతావు. ఆడు సత్తే ఓ పాలిసాగా యేడవ్వ గదంట్రా" అన్నది సుక్కమ్మ కోపంగా.

"పిచ్చిమొకమా. తాగి సచ్చినోడు సొర్గానికి యెళతాడే ఆడికోసం యేడవగూడదు" అన్నాడు వాడు ముంతలో కల్లు గుటగుటాతాగి.

"ఎందీ ఇక సుకెల్లయ్యిరా?" ముద్దగా వచ్చాయి కోటేశు మాటలు.

"సచ్చిపోతావ్."

"సత్తే సచ్చాను .. పోసెయ్" విసుగ్గా అన్నాడు కోటేశు.

"సరే సావు" అంటూ ముంతలో కల్లు పోసింది సుక్కమ్మ.

మళ్ళీ తాగుతున్నాడు కోటేశు.

కొంచెం దూరంలో సముద్రపు హోరు జోరుగా వినిపిస్తోంది.

కోటేశు హృదయంలో కూడా యెన్నో సముద్రాలు హోరుమంటున్నాయి. అతనిగుండె మండుతోంది. బాధతో విలవిల్లాడిపోతున్నాడు.

"పచ్చిమోసం చేసింది నంజ" కసిదీరా తిట్టుకున్నాడు తనలో తను.

"ఇట్టాటి నంజను సంపినా పాపం నేదు" ముంతని కిందికి దించి అనుకున్నాడు.

"దీనికి తనేటి లోపం జేశాడు? ప్రానానికి ప్రానంగా సూసుకున్నాడు. ఎప్పుడూ పన్నెత్తు మాటననేదు. కోపవొచ్చినా సంపుకున్నాడు. తిను తినకు దా దానికి యెట్టాడు. పెల్లయి ఇంకా నాలుగేళ్ళు అవలేదు. ఓ పిల్ల పుట్టి పోయింది. ఆరోజు అది యెంతగా యేడ్చింది? తను ఎంత దయిర్యం సెప్పాడు. "ఉంకో యేడు తిరిగేసరికి నువ్వు బిడ్డనెత్తుకుంటావే" అని సెప్పాడు.... సెప్పాడేగానీ అది జరగనేదు. జరగనేదని యింత గోరం సేత్తు దా నంజ. బిడ్డలు పుట్టనేదని అందరూ మొగుళ్ళని ఒగ్గేసి వుంకోల్లతో నేచి పోతున్నారా?"

కోటేశు కళ్ళవెంట నీళ్ళు కారుతున్నాయి. తాగి తాగి అలసిపోయాడు.

కళ్ళు మూతలు పడుతున్నాయి.

ఎవరో ఎవరో వచ్చి కల్లుతాగి వెళుతున్నారు. కొంతమంది కోటేశును చూసి గుసగుసలు చెప్పుకుంటున్నారు. వాళ్లు మాటాడుకుంటున్న మాటలు కోటేశుకు సరిగా వినిపించడంలేదు. కోటేశు ఆలోచనలన్నీ ఆ క్రితం రాత్రి నడిజాములో లేచిపోయిన పెళ్లాంమీదే వున్నాయి.

క్రితం రాత్రి చేపలమ్మగా వచ్చిన డబ్బులతో పీకవరకూ తాగి గూటికి చేరాడు కోటేశు. అప్పటికి కోటేశు పెళ్లాం మంగమ్మ వంటవేసి తను తిని పడుకుంది.

---

ప్రతాప రవిశంకర్

కోటేశు తినకుండానే నేలమీద పడి నిద్ర పోయాడు. అలా నిద్రపోయిన కోటేశుకు తెల్లవారిన తర్వాతగానీ మెలకువరాలేదు. చూస్తే గుడిసెలో మంగమ్మ లేదు. మంగమ్మకు సంబంధించిన యే వస్తువూ ఆ గుడిసెలో లేదు.

మంగమ్మ ఏమయిపోయిందో కోటేశుకు సులభంగానే అర్థమయిపోయింది. అప్పటి కప్పుడే ఈ విషయం వూరంతా పాకిపోయింది. కొంతమంది కోటేశు ముఖంమీదే అడిగారు. మరికొందరు బాధపడతాడని అడగలేదు.

బ్రతుకు శూన్యమనిపించింది కోటేశుకు. దుఃఖం ఉప్పెనలా ముంచుకువచ్చింది. భరించ లేకపోయాడు. గబగబా సుక్కమ్మ కల్లు దుకాణం దగ్గరకు వచ్చాడు.

చేపలా తాగుతూ కూర్చున్నాడు.

"సముద్రంమీదకి ఎల్లవేట్రా?" అడిగింది సుక్కమ్మ.

"ఇంకేం ఎల్తాడే సుక్కమ్మా. ఆడు సవుద్ర వంత దుక్కంలో మునిగిపోతేనా" ఎవడో అన్నాడు నవ్వుతూ.

"నోర్మయ్యరా యెదవా. నీ పెళ్లాం నేచి పోతే నువ్వేడవేట్రా?"

"నా పెళ్ళాం యెటికి నేచిపోతదే. దానికి నలుగురు బిడ్డలు."

కోటేశు కళ్ళు మరింత యెర్రబడ్డాయి.

"నీ యవ్వ. దొంగనాయాలా. సంపుతా నిన్ను" అని వాడిమీదకు వెళ్ళబోయి తూలి వెనక్కి పడ్డాడు కోటేశు.

"సంపావులే.... ఎల్లి గూట్లో తొంగో" అన్నాడు వాడు నవ్వుతూ.

"నిన్ను సంపుతాను. నిన్ను సంపుతాను" కోటేశు మళ్ళీ లేవబోయి పడిపోయేడు.

"ఒరేయ్ గంగులూ. ఈడ్ని తీసుకెళ్ళి గుడిసెకాడ వొదిలేసి రారా" ఎవడ్నో పిల్చి చెప్పింది సుక్కమ్మ.

వాడు కోటేశును లేవదీసి వాడి చేతులను తన భుజాలమీదకు వేసుకొని కల్లు దుకాణం నించి బయటపడ్డాడు.

* * *

తెల్లవారింది.

కోటేశు తన బాధను కొంతవరకు మరచి పోగలిగాడు. అయినా అతని గుండె వుండుండి కలుక్కుమంటోంది.

గుండెను రాయి చేసుకున్నాడు.

వల తీసుకున్నాడు.

సముద్రానికి బయల్దేరాడు.

కోటేశువెళ్ళేసరికి కొన్ని పడవలు సముద్రం మీదికి వెళ్ళిపోయాయి.

తన పడవగ్గరకు చేరుకున్నాడు కోటేశు.

పడవలో కూర్చున్న ఓ ఆడది కనిపించిం దతనికి.

కోటేశుకు ఆశ్చర్యమయింది.

"ఓరు నువ్వు?" అడిగాడు.

"సీతాలు."

"నిన్నెప్పుడూ సూడనేదే. ఈ వూరికి కొత్తగా వచ్చినావా?" అడిగాడు కోటేశు.

"అవును."

"ఎవురెవరు?"

"మా యమ్మ, నేను."

"నీ కింకెవరూ లేరా?"

"లేరు."

వెంటనే మాటాడలేదు కోటేశు. ఆ అమ్మా యినే చూస్తూ నిల్చున్నాడు.

చామెరేదేసి కళ్ళు—నల్లగా కంచువిగ్రహంలా వుంది. ఎత్తయిన గుండెలు—గుండెలమీద సముద్రపుగాలికి ఎగురుతున్న పమిట.

కోటేశు గుండెల్లో అలజడి మొదలయ్యింది. అలాగే చూస్తూ నిలబడిపోయాడు.

సముద్రపు కెరటాలు రివ్వున వచ్చి కోటేశు పాదాలను తడిపాయి.

"నాతో వల యిసరటానికి వొత్తావా?" అడిగాడు కోటేశు ఆశగా.

తల వూపింది సీతాలు.

కోటేశుకు సంతోషమయింది. పడవను సముద్రంలోకి నెట్టాడు. తనూ యెక్కాడు.

ముందుకు సాగింది పడవ.

"నీకు తెడ్డెయ్యటం వచ్చా?" అడిగాడు.

"వొచ్చు."

సీతాలు పడవ నడుపుతోంది. నీటివి దూసు

కుంటూ ముందుకు పోతోంది పడవ.

కోటేశు ఏవో కబుర్లు చెబుతున్నాడు. నవ్వుతోంది సీతాలు.

చాలాదూరం వెళ్ళింది పడవ. వలవిసిరాడు కోటేశు.

వలనిండా పెద్ద పెద్ద చేపలు పడ్డాయి.

"నువ్వొచ్చిన అదురుష్టం. ఒక్కసారి ఎన్నిబడ్డాయో సూడు" అన్నాడు కోటేశు సంతోషంగా.

నవ్వింది సీతాలు.

అలా సూర్యుడు వాలిపోయేవరకూ సముద్రంమీదనే వుండిపోయారు కోటేశు, సీతాలు. తను తీసుకెళ్ళిన అన్నాన్నే సీతాలు చేత తినిపించాడతను.

తన కథనంతా చెప్పాడు. సీతాలు యెంతో సానుభూతిని చూపించింది.

పడవ వెనక్కు మళ్ళింది.

తీరం చేరుతూ వుండగా "నన్ను మనువాడతావా?" ఆశగా అడిగాడు కోటేశు.

సిగ్గుపడిపోయింది సీతాలు.

"సెప్పు సీతాలూ" వంచిన తలను పైకెత్తుతూ అడిగాడతను.

తల వూపింది.

"మీయమ్మతో సెబుతావా మన యిసయం."

మళ్ళీ తల వూపింది.

పడవ వొడ్డుకు చేరేసరికి చీకటిపడింది.

"నువ్వు చక్కనిదానివి సీతాలూ" ఇసుకలో నడుస్తూ అన్నాడు కోటేశు.

తల వంచుకొంది సీతాలు.

"ఈ సేపలన్నీ నువ్వే తీసుకెల్లు."

"మరి నీకో."

"నాకొద్దు.... నాకు సంతోషంగా వుంది. నువ్వే తీసుకో."

"వొద్దు. నువ్వు సొగం తీసుకో."

"వద్దంటుంటే.... ఈ రేత్రి నువ్వు మీ యమ్మతో సెప్పు. రేపే నిన్ను మనువాడతాను."

"నే యెల్తాను. మా యమ్మ సూత్తూ వుంటుంది."

"ఎల్లు."

ముందుకు కదిలింది సీతాలు.

"సీతాలూ ఒక్క చణం."

ఆగిపోయింది.

దగ్గరగా వెళ్ళి సీతాలును గట్టిగా కౌగలించుకున్నాడు కోటేశు. ఉక్కిరి బిక్కిరయింది సీతాలు. బుగ్గలమీద, పెదవులమీద ఆవేశంగా ముద్దు పెట్టుకున్నాడు.

ఎవరో దూరం నించి వస్తున్న మాటలు వినిపించాయి.

సీతాలును విడిచి, "ఎల్లు" అన్నాడు.

తడబడే అడుగులతో గబగబా చీకట్లో కలిసిపోయింది సీతాలు.

కోటేశుకు సంతోషంతో గుండెలు గుబగుబలాడాయి. ఇప్పుడతనికి లేచిపోయిన పెళ్లాం గుర్తుకురావడంలేదు. ఎప్పుడయినా గుర్తొచ్చినా "పోతేపోయింది ఎదవముండ. సీతాలు కాలిగోటికూడా సరిపోదు" అనుకున్నాడు.

తన గుడిసెకు వెళ్ళలేదతను. సుక్కమ్మ కల్లు దుకాణానికి వెళ్లాడు.

తాగుడుకు కూర్చున్నాడు.

ఎంత తాగుతున్నాడో తెలీకుండా తాగుతున్నాడు.

'సీతాలు తనని మనువాట్టానికి ఒప్పుకుంది. సక్కని సుక్క. ఈ ఇసయం ఆ నంజకు తెలిస్తే కన్ను కుట్టిపోతుంది. తను అదృష్టమంతుడు. బంగారంనాంటి సీతాలు ఇకనించీ తన పెళ్లాం. తన గుడిసెలో వుంటది.'

"ఏటిరా ఈ తాగటం కోటేశూ. మళ్ళీ యేటయినాది నీకు సచ్చేట్టు తాగుతుండావు?" ముంతలో కల్లు పోస్తూ అడిగింది సుక్కమ్మ.

"నీ యవ్వ. పొయ్యవే సుక్కమ్మా. నానేం యేడుత్తూ తాగడం నేదే. సంతోషంతో తాగుతూండానే. పొయ్యి."

"ఏటికిరా అంత సంతోషం?"

"సెప్పను. తెల్లారి నీకే తెలుసుద్ది."

"సరే. సెప్పొద్దులే. . యింక తాగుడు ఆపెయ్."

"ఈల్లేదు. ఇంకా తాగుతాను. పీకల ముయ్యా తాగుతాను. నీ కోట్లో వున్న కల్లంతా తాగుతాను" పెద్దగా నవ్వుతున్నాడు కోటేశు.

నవ్వుతూ తాగుతున్నాడు. పిచ్చిగా తాగుతున్నాడు—పిచ్చివాడిలా తాగుతున్నాడు—చేపలా తాగుతున్నాడు. □